

రేపు ఉద్యోగుల సమస్యలపై సమావేశం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉద్యోగుల సమస్యలపై ఈ నెల ఏడో తేదీ గురువారం ఉదయం పది గంటలకు స్థానిక రెవెన్యూ భవనంలో సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎపి జెఎసి అమరావతి జిల్లా ఛైర్మన్, రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ కె.రమేష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు, 12వ పిఆర్‌సి నియామకం, మధ్యంతర భృతి, పెండింగ్‌లో ఉన్న డిఎలు, పెన్షనర్లకు రావాల్సిన బకాయిలపై ఈ సమావేశంలో చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని పేర్కొన్నారు. ముఖ్యఅతిథిగా ఎపి జెఎసి అమరావతి రాష్ట్ర ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు హాజరవుతున్నారని, తర్వాత కౌన్సిల్ సమావేశం, అనంతరం తహశీల్దార్లతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

కౌలు రైతులకు దక్కని 'సుఖీభవ'..!

రెండు జిల్లాల్లో లక్షా 62 వేల కౌలు కార్డుల జారీ లక్ష్యం

ఇప్పటికీ పూర్తికాని లక్ష్యం.. ఇక పెట్టుబడి సాయం అందేదెన్నడో

సాగు చేయని భూయజమానులకు సొమ్ములు



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రభుత్వం అందించే పెట్టుబడి సాయం సాగు చేసే కౌలు రైతులకు ప్రభుత్వం ఎప్పటికి ఇస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. సాగు చేయని భూయజమానులకు ముందుగా అన్నదాత సుఖీభవ సొమ్మును జమ చేయడం కౌలు రైతుల్లో చర్చనీయాంశంగా మారింది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని వ్యవసాయ శాఖ సాగులో 80 శాతం కౌలు రైతులే చేస్తున్నారు. వరి, పొగాకు, పామాయిల్, మిర్చి ఇలా అనేక పంటలను కౌలురైతులు సాగు చేస్తున్నారు. రెండు జిల్లాల్లో దాదాపు మూడు లక్షల మంది కౌలు రైతులు ఉన్నట్లు గతంలో ప్రభుత్వమే నిర్ధారించింది. ఆ లెక్కలను పక్కనబెట్టి ఇప్పుడు పశ్చిమగోదావరి జిల్లాలో 87 వేలు, ఏలూరు జిల్లాలో 75 వేల మందికి కౌలుకార్డులు జారీ చేయాలని ప్రభుత్వం టార్గెట్ విధించింది. ఇప్పటికీ ఆ ప్రక్రియ కొనసాగుతూనే ఉంది. ఎప్పటికి పూర్తవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా ఏడాదికి రూ.20 వేల చొప్పున రైతులకు పెట్టుబడి సాయం అందిస్తామని తెలిపింది. అందులో భాగంగా కేంద్రం పిఎం కిసాన్ సమాన్ నిధి కింద ఇచ్చే రూ.ఆరు వేలు కాకుండా, మిగిలిన రూ.14 వేలు మూడు విడతలవారీగా కేంద్రం విడుదల చేసిన సమయంలో ఇస్తామని చెప్పింది. అందులో భాగంగా ఈ నెల రెండో తేదీన అన్నదాత సుఖీభవ కింద పెట్టుబడి సాయం సొమ్ము మొదటి విడత రూ.5 వేలు జమ చేసింది. జమ చేసిన రైతుల్లో ఒక్క కౌలు రైతు కూడా లేకుండా పోయాడు. ఏలూరు జిల్లాలో 1,60,968 మందికి రూ.107.08 కోట్లు సొమ్ములు జమవ్వగా, పశ్చిమలో 1,00,751 మందికి రూ.71.14 కోట్లు జమ చేసింది.

కౌలు రైతుకు మొండిచెయ్యి..

ఖరీఫ్ సాగు ప్రారంభమై రెండు నెలలు గడిచిపోయింది. రైతులు నాట్లు నాటారు. కౌలు రైతులు పెట్టుబడుల కోసం నానా తంటాలు పడుతున్నారు. ప్రభుత్వం ఇప్పటి వరకూ కౌలు కార్డుల జారీ ప్రక్రియ కూడా పూర్తి చేయలేదు. బ్యాంకుల్లో పంట రుణాలు కూడా సక్రమంగా ఇవ్వడం లేదు. దీంతో కౌలు రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. పెట్టుబడి సాయం అనేది సాగుచేసే రైతులు అందించాలి. అలా కాకుండా తొలి విడతలో భూయజమానులకు పెట్టుబడి సాయం ప్రభుత్వం జమ చేసింది. కౌలు రైతులకు రెండో విడతలో జమ చేస్తామని చెబుతోంది. కౌలు కార్డుల ప్రక్రియ పూర్తయిన తర్వాత అన్నదాత సుఖీభవ సొమ్ములు ఇస్తామని చెబుతోంది. కార్డులు జారీ ప్రక్రియ ఎప్పటికి పూర్తి చేస్తారో, ఎప్పటికి అన్నదాత సుఖీభవ సొమ్ములిస్తారో అర్థం కాని పరిస్థితి ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం కౌలు రైతులకు వెంటనే అన్నదాత సుఖీభవ సొమ్ము జమ చేయాలని అంతా కోరుతున్నారు. గత వైసిపి ప్రభుత్వం కౌలు రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మేలు జరుగుతుందని కౌలు రైతులు ఆశించారు. కూటమి ప్రభుత్వం వైసిపి బాటలోనే నడుస్తోంది. కౌలు రైతులకు ఇచ్చే సొమ్ముపై ప్రభుత్వం తాత్సారం చేయడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అసలు కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ సొమ్ములిస్తారా.. ఈ ఏడాదికి ఎగనామం పెట్టేస్తారా అనే అనుమానాలు అలుముకున్నాయి. ప్రభుత్వాలు మారినా కౌలు రైతుల కష్టాలు మాత్రం తీరడం లేదు. ప్రతిపక్షంలో ఉండగా కౌలురైతుల గురించి తెగ మాట్లాడిన డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ కూడా తమను పట్టించుకోవడం లేదనే భావన కౌలురైతుల్లో వ్యక్తమవుతోంది.



ఏలూరులో విద్యుత్ భవన్ వద్ద బైఠాయించి నినదిస్తున్న నేతలు



నూజివీడులో ధర్నాలో నినదిస్తున్న నేతలు, ప్రజలు

స్మార్ట్ మీటరు బిగించొద్దు..

ప్రజాసంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యాన ధర్నాలు, వినతులు

'స్మార్ట్ మీటర్లు వద్దు, ట్రూఅప్ ఛార్జీలు రద్దు చేయండి' అంటూ ప్రజాసంఘాల ఐక్య కార్యాచరణ వేదిక ఆధ్వర్యాన మంగళవారం జిల్లాలోని విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్ద, మండల కేంద్రాల్లో పెద్దఎత్తున ధర్నాలు, ర్యాలీలు నిర్వహించారు. ఎన్నికల ముందు చెప్పిందేమిటీ, చేస్తుందేమిటని గళం విప్పారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగులగొట్టండని చెప్పి, అధికారంలోకొచ్చాక అదానీతో ఒప్పందం రద్దు చేయకుండా అవే స్మార్ట్ మీటర్లను బిగించడం ఏం న్యాయమని నిలదీశారు. ఈ ర్యాలీలు, ధర్నాలు, ఆందోళనలకు ప్రజాసంఘాల ఐక్యవేదిక నేతలు నాయకత్వం వహించగా, సిపిఎం, సిపిఐ, వామపక్షాల నేతలు సంఘీభావం తెలిపారు. ఏలూరులోని విద్యుత్ భవన్ వద్ద నిర్వహించిన ధర్నాలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి, ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, వ్యవసాయ కార్మిక సంఘం (సిపిఐ) జిల్లా నాయకులు మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడారు. చింతలపూడిలో ప్రదర్శన నిర్వహించి, విద్యుత్ శాఖ ఎడి కార్యాలయం ముందు బైఠాయించారు. కుక్కునూరు సబ్‌స్టేషన్ వద్ద నిర్వహించిన ధర్నాలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు మొడియం నాగమణి పాల్గొని మాట్లాడారు. భీమడోలు మండలం పొలసానిపల్లిలోని ఎడిఇ కార్యాలయం ముందు చేపట్టిన ధర్నాలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు మాట్లాడారు. నూజివీడు, ముసునూరుల్లో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు పాల్గొని మాట్లాడారు. బుట్టాయగూడెంలో ఎపి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ మాట్లాడారు. జీలుగుమిల్లి, టి.నర్సాపురం, నిడమర్రు, వేలేరుపాడు, ద్వారకాతిరుమల, ఆగిరిపల్లి తదితర కేంద్రాల్లో ఆందోళనలు నిర్వహించారు. వార్త 6వ పేజీలో..



కుక్కునూరులో వినతి అందజేస్తున్న నేతలు



బుట్టాయగూడెంలో ధర్నాలో నినదిస్తున్న నేతలు

అంబులెన్స్ ఢీకొని ఇద్దరు దుర్మరణం



మృతుడు శ్రీరామ్మూర్తి



మృతుడు చిరంజీవి



ప్రమాదానికి కారణమైన అంబులెన్స్

ప్రజాశక్తి - ఉంగుటూరు

చావుబతుకుల మధ్య ఉన్న రోగిని స్వస్థలానికి తీసుకెళ్తున్న అంబులెన్స్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన జాతీయ రహదారిపై కైకరం-పూళ్ల మధ్య మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. అంబులెన్స్‌లోని రోగి పరిస్థితీ విషమంగా ఉన్నట్లు సమాచారం. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం కైకరానికి చెందిన రైతు గున్ను శ్రీరామ్మూర్తి (65)కు జాతీయ రహదారి వెంబడి కైకరం-పూళ్ల మధ్యలో పొలం ఉంది. ఆ పొలంలో కలుపుతీత పనుల కోసం మంగళవారం ఉదయమే కూలీలు వచ్చారు. ఈ క్రమంలో పనులను పరిశీలించేందుకు కైకరంలోని ఇంటి వద్ద నుంచి సుమారు కిలోమీటరులోపు దూరంలోనే ఉన్న పొలానికి శ్రీరామ్మూర్తి తన ద్విచక్ర వాహనంపై బయల్దేరారు. కొద్దిదూరం వచ్చాక ఆ పొలంలో పని చేసేందుకు అదే గ్రామానికి చెందిన పేంద్ర చిరంజీవి (42) నడుచుకుని వస్తుండగా మార్గమధ్యంలో శ్రీరామ్మూర్తి తన మోటారు సైకిల్ ఎక్కించుకున్నారు. అక్కడి నుంచి జాతీయ రహదారిపై అపసవ్య దిశలో పొలం వైపు వెళ్తుండగా హైదరాబాద్ నుంచి తణుకు వెళ్తున్న ప్రయివేటు అంబులెన్స్ ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొంది. దీంతో మోటారు సైకిల్‌పై ఉన్న ఆ ఇద్దరు గాల్లోకి ఎగిరి పక్కనే ఉన్న పంట బోదెలోకి పడిపోయి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. తణుకుకు చెందిన ఓ మహిళ హైదరాబాద్‌లో ఓ ఆసుపత్రికెళ్లగా చికిత్స అందించలేని పరిస్థితుల్లో స్వస్థలం తణుకు తీసుకొస్తుండగా కైకరం వద్ద ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనతో అంబులెన్స్‌లోని రోగి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు సమాచారం. ప్రమాద ఘటన తెలియగానే చేబ్రోలు ఎస్ఐ మామిడాల సూర్యభగవాన్ ఘటనా స్థలికి చేరుకుని పరిస్థితిని పర్యవేక్షించారు. అంబులెన్స్‌లోని రోగిని మరో అంబులెన్స్‌లో తణుకు పంపారు. మృతదేహాలను తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బీహార్‌లోని పాట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనుపమ చక్రవర్తికి మృతుడు గున్ను శ్రీరామ్మూర్తి సొంత బావ.

కుటుంబానికి ఆధారం కోల్పోయాం

పేంద్ర చిరంజీవి వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. భార్య తిరుపతమ్మ, ఇంటర్ చదువుతున్న కుమారుడు నాగరాజు, పదో తరగతి చదువుతున్న కుమార్తె గంగోత్రి ఉన్నారు. కూలి పనులు చేస్తూ చిరంజీవి, తిరుపతమ్మ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. పిల్లలు విద్యాభ్యాస దశలోనే ఉండగానే యజమాని చిరంజీవి మృతి చెందడంతో ఆ కుటుంబం రోడ్డున పడినట్లయ్యింది. చిరంజీవి ఎన్‌టిఆర్ పాటలను చాలా చక్కగా పాడేవాడని గ్రామస్తులు గుర్తు చేసుకుని తమ బాధ వ్యక్తం చేశారు.

భూసేకరణ పనులు వేగవంతం చేయాలి

ఎంఎస్ఎంఇ యూనిట్ల ఏర్పాటు లక్ష్యాలను సాధించాలి - కలెక్టర్ కె.వెట్రిసెల్వి



ప్రజాశక్తి - ఏలూరు

జాతీయ రహదారులు, ఆర్అండ్ఆర్, ఎంఎస్ఎంఇ తదితర పనులకు అవసరమైన భూసేకరణ వేగవంతం చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్ నుండి మంగళవారం పోలవరం ఆర్అండ్ఆర్, ఎంఎస్ఎంఇ, జాతీయ రహదారులకు భూసేకరణ, మొబైల్ టవర్లకు అనుమతులు తదితర అంశాలుపై అధికారులతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి భూములు అందించిన నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీలో భాగంగా భూమికి భూమి, ఆర్అండ్ఆర్ కాలనీల నిర్మాణం తదితర పనులకుగాను ఏలూరు జిల్లాలో ఐదు వేల ఎకరాల భూమి అవసరమవ్వగా, ఇప్పటికే బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో 800 ఎకరాలను గుర్తించామన్నారు. మిగిలిన 4,200 ఎకరాలకు మండలాలవారీగా భూసేకరణపై సమీక్షించగా మరో 600 ఎకరాలు గుర్తించినట్లు తెలిపారు. భూసేకరణ పనులను ఈ నెల 15వ తేదీ నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. భూసేకరణ కోసం భూమిని గుర్తించిన తర్వాత ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. భూములు గుర్తించిన తర్వాత ఆయా రైతులతో ఆర్‌డిఒ, డిఎస్‌పి తదితర అధికారులు చర్చించి వారి సమక్షంలో గ్రామ సభలు నిర్వహించాలని సూచించారు. భూములకు పరిహారాన్ని ప్రభుత్వ నిబంధనల ప్రకారం రైతులకు చెల్లించడానికి అన్ని చర్యలూ తీసుకోవాలన్నారు. ఎంఎస్ఎంఇ యూనిట్ల ఏర్పాట్లలో నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారులకు భూసేకరణ వేగవంతం చేసి నిర్మాణ పనులకు అప్పగించాలన్నారు. మొబైల్ టవర్స్ ఏర్పాటుకు జనావాసాలకు దూరంగా, చుట్టుపక్కల ప్రజలకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా అనుమతులు మంజూరు చేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, అల్లూరి జిల్లా ఐటిడిఎ పిఒ అపూర్వ భరత్, ఆర్‌డిఒలు బచ్చు స్మరణ్‌రాజ్, ఎంవి.రమణ, ఎం.అచ్యుత అంబరీష్, స్పెషల్ కలెక్టర్ ఎస్.సరళవందనం తమ కార్యాలయాల నుంచి పాల్గొన్నారు.

ఫోన్లు ఇచ్చిన అంగన్వాడీలపై వేధింపులు తగవు: సిఐటియు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పని చేయని ఫోన్లను ఐసిడిఎస్ కార్యాలయాల్లో అప్పగించిన అంగన్వాడీలపై అధికారుల వేధింపులు మానుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి. ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీలు పని చేయని తమ ఫోన్లను ఐసిడిఎస్ కార్యాలయాల్లో అప్పగించారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఐదేళ్ల క్రితం ఇచ్చిన ఫోన్లు పని చేయట్లేదని, ఆన్‌లైన్ వర్క్ చేయడమూ ఇబ్బందవుతుందని ఎన్నోసార్లు మొరపెట్టుకున్నా అధికారులు, ప్రభుత్వం కనీసం పట్టించుకోకుండా టార్గెట్ల పేరుతో అంగన్వాడీలను తీవ్రంగా వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అప్పుడిచ్చిన ఫోన్లు టూజిబి ర్యామ్ కావడంతో ఆన్‌లైన్ వర్క్‌కు సహకరించడం లేదని అధికారులకు తెలియజేసినా నిమ్మకు నీరెత్తినట్లుగా నిర్లక్ష్యంగా వ్యవహరించారని తెలిపారు. లబ్ధిదారుల ఫొటో క్యాప్చర్, ఒటిపి, ఎఫ్ఆర్ఎస్ ద్వారానే సరుకులు ఇవ్వాలని పెట్టిన నిబంధనల వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నెట్ సిగ్నల్స్ లేకపోవడం, సర్వర్ పని చేయకపోవడం వల్ల లబ్ధిదారులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకుండా ఫోన్లు అప్పగించిన అంగన్వాడీలపై కొద్దిమంది అధికారులు వేధింపులకు పాల్పడడం, దుర్భాషలాడటంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల బెదిరింపులకు అంగన్వాడీలు లొంగరని హెచ్చరించారు. సమస్యను సానుకూలంగా పరిష్కరించాల్సిన అధికారులు ఇప్పటి వరకూ స్పందించకుండా నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. తక్షణమే అంగన్వాడీలకు 5జి ఫోన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అన్ని యాప్‌లను కలిపి ఒక యాప్‌గా మార్పు చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

హక్కులు హరించేలా విద్యాశాఖ ఉత్తర్వులు

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన నిరసన



నినదిస్తున్న విద్యార్థి నేతలు, విద్యార్థులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ప్రభుత్వ పాఠశాలల్లోకి మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు మినహా ఎవరినీ అనుమతించరాదని పాఠశాల విద్యాశాఖ ఇచ్చిన ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షులు ఎస్.శివాజీ మాట్లాడుతూ విద్యాశాఖ ఉత్తర్వులు విద్యార్థుల స్వేచ్ఛను, ప్రజాస్వామిక హక్కులను హరించే విధంగా ఉన్నాయని, విద్యార్థి సంఘాలను, ప్రజాస్వామికవాదులను పాఠశాలల్లోకి అనుమతించకపోవడం దుర్మార్గమని అన్నారు. వెంటనే ఆ ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఉత్తర్వులతో ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల్లో జరిగే విద్యా వ్యాపారాన్ని, అక్కడ జరిగే అరాచకాలను బయటకు తీసే అవకాశం లేకుండా పోతుందని, దీంతో వారి దోపిడీ పెంచుకునేందుకు ఈ ఉత్తర్వులు దోహదపడతాయని, ఇది విద్యార్థుల, విద్యార్థుల తల్లిదండ్రుల హక్కులను కాలరాయడమేనని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే పెద్దఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్, నగర ఉపాధ్యక్షులు ఎం.జయంత్, సహాయ కార్యదర్శి ఎం.శివ వర్ధన్‌సాయి పాల్గొన్నారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి : జెసి

జాతీయ రహదారిపై నిలిచిన పనుల పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న జెసి

ప్రజాశక్తి - మండవల్లి


సూచిక బోర్డులను ఏర్పాటు చేయకపోతే పనులు జరుగుతున్నట్లు వాహదారులకు ఎలా తెలుస్తుందని జిల్లా జాయింట్ కలెక్టర్ ధాత్రి రెడ్డి ఎన్‌హెచ్ అధికారులను ప్రశ్నించారు. జాతీయ రహదారిపై నిర్లక్ష్యంగా నిర్వహిస్తున్న పనులతో వాహనదారులు మృత్యువాత పడడంపై ప్రజాశక్తిలో ఆ పనులు మృత్యు పాశాలు అనే శీర్షిక ప్రచురితమైన సంగతి పాఠకులకు విధితమే. దీంతో స్పందించిన జాయింట్ కలెక్టర్ ధాత్రి రెడ్డి, జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్‌తో కలిసి మంగళవారం జాతీయ రహదారిపై నిలిచిపోయిన పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె లింగాల వద్ద ఉండికి చెందిన యువకుడు మృతిచెందిన ప్రాంతాన్ని, మండవల్లిలోని టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ వద్ద ప్రమాదాలకు నిలయంగా ఉన్న ప్రాంతాన్ని పరిశీలించారు. పనులు నిర్వహిస్తున్నట్లు, రహదారి విస్తరణ పనులు జరుగుతున్నట్లు ఎక్కడ ఆనవాళ్లు లేవని, పనులకు అవసరమైన ముడి సరుకును ఎక్కడా నిలువ ఉంచిన దాఖలాలు కనపడటం లేదని, పనులను ఎందుకు నిలపదల చేశారని ఆమె అధికారులను ప్రశ్నించారు. పనులు నిర్వహిస్తున్నట్లు, నిలుపుదల చేసినట్లు వాహనదారులకు తెలిసే విధంగా సూచిక బోర్డులను ఎందుకు ఏర్పాటు చేయడం లేదని ఆమె ప్రశ్నించారు. మండవల్లిలో డ్రెయినేజీ నిర్మించే క్రమంలో కూలీ మృతి చెందినట్లు వార్తలు వస్తున్నాయని, కూలీ ఎలా మృతిచెందాడని ఆమె అధికారులను నిలదీశారు. కూలీ మాత్రమే కాదని సుమారుగా 8 మంది వాహనదారులు రహదారి విస్తరణ పనులకు బలైపోయారని స్థానికులు ఆమె వద్ద వాపోయారు. జాతీయ రహదారి అభివృద్ధిలో భాగంగా విద్యుదీకరణ పనులను ఇష్టానుసారంగా నిర్వహించారని, అధికారులు ఎవరూ పట్టించుకోలేదని అందువల్ల రానున్న రోజుల్లో ప్రమాదాలు పొంచి ఉన్నాయని, రహదారి అభివృద్ధి పనుల్లో భాగంగా గ్రామానికి తాగునీరు సరఫరా అయ్యే కులాయి పైపులను కూడా ఇష్టానుసారంగా నిర్వహిస్తున్న అధికారులు ఎవరు పట్టించుకోకపోవడంతో గత పది రోజులుగా తాగునీరు అందని పరిస్థితి నెలకొందని గ్రామస్తులు ఆమె వద్ద వాపోయారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ప్రమాదాలు జరగకుండా పూర్తిస్థాయిలో హెచ్చరికలతో కూడిన బోర్డులను ఏర్పాటు చేయాలని ఆమె అధికారులకు ఆదేశించారు. కొర్లపాడు వద్ద ఉన్న నాగేంద్ర స్వామి గుడికి నష్టపరిహారం అందలేదని పిజిఆర్ఎస్‌లో దాఖలైందని పరిశీలించి చర్యలు తీసుకోవాలని తెలిపారు ఈ కార్యక్రమంలో ఆమె వెంట ఎన్‌హెచ్ అధికారులు సత్యనారాయణ, శరత్, తహశీల్దార్ గోపాల్, డిఎస్‌పి శ్రావణ్ కుమార్, సిఐ రవికుమార్, ఎస్ఐ రామచంద్రరావు పాల్గొన్నారు.

ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి..

ముదినేపల్లి : రోడ్డు ప్రమాదాలు జరగకుండా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని జెసి ధాత్రి రెడ్డి అన్నారు. మంగళవారం జెసి మండలంలో జరుగుతున్న జాతీయ రహదారి విస్తరణ పనులను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. మండలంలోని పెదపాలపర్రు వద్ద నుంచి ముదినేపల్లి వరకు జరిగే రోడ్డు విస్తరణ పనులను పరిశీలించి అధికారులకు తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా ముదినేపల్లిలోని పోల్ రాజు మురుగు కాలువ వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విశ్రాంతి శాస్త్రవేత్త చందు వెంకటేశ్వరరావు ప్రమాదానికి గురైన ప్రాంతాన్ని పరిశీలించారు. రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నప్పుడు ఎందుకు ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదని ఎన్‌హెచ్ అధికారులను ప్రశ్నించారు. మీ నిర్లక్ష్యం వల్ల ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ముదినేపల్లి సెంటర్లో జరుగుతున్న డ్రెయినేజీ నిర్మాణ పనులు అస్తవ్యస్తంగా, వంకర టింకరగా ఉన్నాయని జెసికి వినతి పత్రం ఇచ్చారు. దీనిపై ధాత్రి రెడ్డి స్పందిస్తూ పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటానన్నారు. ఆమె వెంట జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్, నేషనల్ హైవే డి.సత్యనారాయణ, తహశీల్దార్ లతీఫ్ పాషా ఉన్నారు.

విద్యాశక్తి కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నాం

డిఇఒకు ఫ్యాప్టో నేతల లేఖ



డిఇఒకు లేఖ అందిస్తున్న నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నుండి పాఠశాల విద్యాశాఖ ప్రవేశ పెట్టిన విద్యాశక్తి కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నట్లు ఫ్యాప్టో నాయకులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం డిఇఒకు లేఖ అందజేశారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో నాయకులు మాట్లాడుతూ పాఠశాల విద్యాశాఖ విద్యాశక్తి కార్యక్రమం నిర్బంధం కాదని, ఇది కేవలం ఐచ్ఛికం మాత్రమేనని తెలియజేసినప్పటికీ కొంతమంది అధికారులు ఉపాధ్యాయులను ఇబ్బంది పెట్టేలా విద్యా శక్తి కార్యక్రమం నిర్బంధంగా నిర్వహించాల్సిందేనని ఇబ్బందులకు గురి చేయడం తగదని, విద్యాశక్తి కార్యక్రమాన్ని జిల్లాలో ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో)గా బహిష్కరిస్తున్నామని తెలిపారు. ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్ జి.మోహన్, సెక్రటరీ జనరల్ ఎం.ఆదినారాయణ, డిప్యూటీ సెక్రటరీ జనరల్ ఆర్.రవికుమార్, బి.రెడ్డిదొర, కార్యదర్శి ఐ.రమేష్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సమాజ మార్పు కోసం పాటుపడిన వ్యక్తి ఎంగెల్స్

వర్ధంతి కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి



ఎంగెల్స్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఏలూరు అర్బన్ : పెట్టుబడిదారుని కుటుంబంలో పుట్టిన ఎంగెల్స్ ఆ పెట్టుబడిదారీ వర్గ పెత్తనం సమాజానికి ఎంత కీడు చేస్తుందో అర్థం చేసుకొని ఆ వ్యవస్థ మార్పు కోసం జీవితాన్ని అంకితం చేసిన మహోన్నతుడని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి కొనియాడారు. ప్రపంచ గతిని మార్చిన మార్క్సిజాన్ని రూపొందించడంలో మహోపాధ్యాయుడు కారల్ మార్క్స్‌కు మిత్రుడుగా, చేదోడు వాదోడుగా నిలిచిన ఎంగెల్స్ 130వ వర్ధంతి సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ ఆయనకు ఘనంగా నివాళులు అర్పించింది. మంగళవారం స్థానిక పవర్ పేటలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో ఎంగెల్స్ వర్ధంతి కార్యక్రమం సిపిఎం నగర కార్యదర్శి పి.రవికుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా ఎంగెల్స్ చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్, కె.శ్రీనివాస్ మాట్లాడుతూ 1820 నవంబర్ 28న ఇప్పటి జర్మన్‌లోని బర్మాన్ నగరంలో ఎంగెల్స్ జన్మించారని, 1895 ఆగస్టు 5న లండన్‌లో మృతిచెందారని తెలిపారు. ఈ సమాజం అభివృద్ధి చెందాలంటే శ్రమ దోపిడీ అంతం కావాలని, వ్యక్తిగత ఆస్తిని రద్దు చేయాలని, శ్రమజీవుల కష్టానికి తగిన ఫలితం దక్కాలని ఆయన ఆశపడ్డారన్నారు. సమాజంలో అందరికీ సమాన హక్కులు ఉండాలన్నా, హెచ్చుతగ్గులు లేకుండా అందరూ సమానంగా జీవించాలన్నా, సమ సమాజ స్థాపన జరగాలన్నా సోషలిస్టు వ్యవస్థను నిర్మించడమే మార్గమని మార్క్స్, ఎంగెల్స్ తెలియజేశారన్నారు. అందుకు వారి జీవితాలను అంకితం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో కె.లెనిన్, ఎం.ఇస్సాక్, రామాంజనేయులు, వివివిఎన్.ప్రసాద్, కోటేశ్వరరావు, ఎం.సత్యం పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు హైస్కూల్ విద్యార్థులు

ద్వారకాతిరుమల : ఈనెల తొమ్మిదో తేదీ నుంచి 11వ తేదీ వరకు రాష్ట్రస్థాయిలో బాపట్ల జిల్లాలో జరిగే అథ్లెటిక్స్ పోటీలకు మండలంలోని గున్నంపల్లి హైస్కూల్ నుంచి విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.వరప్రకాశం తెలిపారు. ఎంపికైన విద్యార్థులు టి.రోషిణి హై జంప్ ప్రథమ స్థానం, కె.రమ్యశ్రీ 600 మీటర్లు ప్రథమ స్థానం, కె.ఐశ్వర్య లాంగ్ జంప్ ప్రథమ స్థానం రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను పాఠశాల సిబ్బంది, గ్రామ సర్పంచ్ టి.సుజాత, ఎస్ఎంసి ఛైర్మన్ గోర్జేశ్వరరావు, గ్రామ పెద్దలు అభినందించారు.

కానిస్టేబుల్ ఫలితాల్లో మెరిట్స్ కోచింగ్ సెంటర్ ప్రభంజనం

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెంలో 2025 కానిస్టేబుల్ ఫలితాల్లో పట్టణానికి చెందిన మెరిట్స్ కోచింగ్ సెంటర్ అఫ్ ల్యాండ్ ఏరియాలో ప్రభంజనాన్ని సృష్టించింది. కోచింగ్ సెంటర్‌లో కోచింగ్ తీసుకున్న నలుగురు విద్యార్థులు షేక్ మోతి, కె.రవి వర్మ, ఎం.నరేంద్ర సాయి, ఎస్.రమేష్ కానిస్టేబుల్స్‌గా ఎంపికయ్యారని సెంటర్ డైరెక్టర్ సంజా శేషు తెలియజేశారు. కానిస్టేబుల్ గా ఎంపికైన వారిని జనసేన నాయకులు, మాజీ డిసిసిబి ఛైర్మన్, ఏజెన్సీ టైగర్ కరాటం రాంబాబు శాలువతో సన్మానించి స్వీట్లు పంచి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో పోలీసు ఉద్యోగం అత్యంత బాధ్యతాయుతమైనదని గుర్తించి విధి నిర్వహణలో ప్రజలకు సేవ చేసే విధంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చింతల నాని, కనుకుర్తి ఉమా, పారేపల్లి ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగిన తల్లిపాల వారోత్సవాలు

ఏలూరు సిటీ : ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు ఈనెల 1-7 రోజులు జరుపుతున్న సందర్భంగా మంగళవారం ఏలూరు గవర్నమెంట్ మెడికల్ కాలేజ్ యుహెచ్‌సి పరిధిలో గర్భవతులకు, బాలింతలకు తల్లిపాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు అర్బన్ ప్రాజెక్ట్ సిడిపిఒ, పద్మావతి, యుహెచ్‌సి డాక్టర్ గౌతమ్ రాజ్, హెచ్‌వి.రూపీ మాట్లాడుతూ పుట్టిన వెంటనే అరగంటలోపు బిడ్డకు తల్లిపాలు ఇవ్వాలని, ఇలా ఇవ్వడం వల్ల తల్లికి, బిడ్డకి ఆరోగ్యమన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ మౌనిక, ఎఎన్ఎంలు, అంగన్వాడీ కార్యకర్తలు పి.హైమావతి, అన్నపూర్ణ, మంగమ్మ, నాగమణి పాల్గొన్నారు.

ముసునూరు : బాలింతలు, గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని సిడిపిఒ పి.రాజకుమారి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని వేల్పుచర్ల, కాటేనిపాడు, చిల్లబోయినపల్లి పలు గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలు ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ పి.రాజకుమారి మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. అంగన్వాడీ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంఇఒగా సుభాషిణి బాధ్యతల స్వీకరణ

ముసునూరు : మండల నూతన విద్యాశాఖాధికారిగా బాధ్యతలు స్వీకరించిన పి.సుభాషిణిని మండలంలోని యుటిఎఫ్, ఎస్‌టియు, డిటిఎఫ్‌లకు ఉపాధ్యాయ సంఘాలు ఘనంగా అభినందించాయి. ఈ సందర్భంగా ఎంఇఒ సుభాషిణి మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాలన్నీ ఐకమత్యంతో ఉండటం చాలా సంతోషించదగ్గ విషయమని హర్షం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయ సంఘాలతో సమన్వయం చేసుకొని మండలాన్ని విద్యాపరంగా అభివృద్ధి బాటలో నడిపించడానికి తన వంతు బాధ్యతగా కృషిచేస్తానని తెలిపారు. యూనియన్ నాయకులు జి.పద్మ కిషోర్, సాయిబాబు, ఉదయ భాస్కర్, గుడిమెట్ల రాంబాబు, బాబూరావు, కోలకలూరి రాజు, దుర్గాప్రసాద్, బెనర్జీ, శేఖర్, భాస్కర్ పాల్గొన్నారు.

షేక్ తనీషా వలీకి అభినందన

నూజివీడు టౌన్ : కానిస్టేబుల్ ఫలితాలలో మండలంలోని లైన్ తండాకి చెందిన షేక్ తనీషా వలి 151 మార్కులు సాధించి ఉమ్మడి కృష్ణాజిల్లా ఫస్ట్ ర్యాంకు సాధించినందున టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ముద్రబోయిన వెంకటేశ్వరరావు లయన్ తండాలో షేక్ తనీషా వలి ఇంటి వద్దకు వెళ్లి ఆతని తల్లిదండ్రులను, ఆతన్ని సన్మానించారు. అనంతరం ముద్రబోయిన గ్రామ ప్రజలతో, ఫ్రెండ్స్‌తో మాట్లాడి తల్లిదండ్రులు పిల్లలను విద్య వైపు నడిపించాలని అన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.

ఎంఇఒ-1 సత్యనారాయణ బాధ్యతల స్వీకరణ

ద్వారకాతిరుమల : మండల విద్యాశాఖ అధికారి-1గా ఎం.సత్యనారాయణ బాధ్యతలు తీసుకున్నారు. ఆయన గోపన్నపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోషల్ స్టడీస్ ఎస్ఎగా పనిచేస్తూ మండలంలో ఎంఇఒ-1గా బాధ్యతలు చేపట్టారు. యుటిఎఫ్ మండల నాయకులు ఆయనకు స్వాగతం పలికి, ఇప్పటివరకు పనిచేసిన సుబ్బారావుకు వీడ్కోలు పలికారు.

విద్యార్థులకు కెరీర్ గైడెన్స్

ఏలూరు అర్బన్ : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖకు చెందిన పత్రేబాలలోని రెడ్ క్రాస్ నర్సింగ్ కళాశాలలో విద్యార్థుల భవిష్యత్ ప్రణాళికలపై అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో మంగళవారం 'కెరీర్ మార్గదర్శక సదస్సు' నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ మానసిక నిపుణులు మొగిలి సుభాష్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు ప్రేరణాత్మక ఉపన్యాసం అందించారు. కళాశాల కమిటీ సభ్యులు ఎ.నిర్మల, ఉత్తమ దర్గ, ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ ఎ.ప్రియాంక, ట్యూటర్లు పాల్గొన్నారు.

పలుచోట్ల పొలం పిలుస్తోంది

ముసునూరు: ప్రకృతి వ్యవసాయం ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చునని మండల వ్యవసాయ అధికారిణి అక్కినేని చాముండేశ్వరి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించిన రైతులకు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది, మండల వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చింతలపూడి : ఉన్నదాని సుభిక్షంలో వ్యకాలలో అద్దెలైన వారికి డబ్బులు చెల్లించే ఆలోచనలో ఉన్న ఆలోచిత సెంటర్లో గ్రీనస్‌లో పెట్టుకోవాలని చింతలపూడి వ్యవసాయ ఉప సంచాలకులు సుబ్బారావు తెలిపారు. మండలంలోని యర్రంపల్లి, తిమ్మిరెడ్డి పల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో చింతలపూడి వ్యవసాయాధికారిణి, ఉద్యాన శాఖాధికారి పాల్గొన్నారు.

పి-4పై సమీక్ష

నూజివీడు టౌన్ : దేశంలో ఎక్కడా అమలు చేయని విధంగా మన రాష్ట్రంలో సమాజంలో ఆర్థిక అసమానతలు తొలగించేందుకు పి-4 కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి అమలు చేస్తున్నారని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఆంధ్రప్రదేశ్ సచివాలయం వెలగపూడిలో పి-4 కార్యక్రమంపై మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పార్థసారథి తన క్యాంపు కార్యాలయం నుంచి పాల్గొని జిల్లా, నియోజకవర్గస్థాయిలో పి-4 కార్యక్రమం గురించి వివరించారు. ఈ కార్యక్రమానికి సంబంధించి పి-4 కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందని తెలియజేశారు.

మొకాసా పిఎసిఎస్ అధ్యక్షురాలిగా సృజన బాధ్యతలు

నూజివీడు టౌన్ : మండలంలోని మొకాసా నరసన్నపాలెం గ్రామంలో పిఎసిఎస్ అధ్యక్షురాలిగా యనమదల సృజన మంగళవారం రాత్రి బాధ్యతలు చేపట్టారు. గ్రామంలో మేళ తాళాలు, డప్పు వాయిద్యాలు, బాణాసంచా నడుమ ఊరేగుతూ బ్యాంకుకు చేరుకున్నారు. శ్రీకృష్ణుల ఎటిఆర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళి అర్పించారు. జ్యోతి ప్రజ్వలన చేసి అనంతరం బ్యాంక్ అధికారుల సమక్షంలో నూతన అధ్యక్షురాలు సృజన ప్రతిజ్ఞ చేశారు. మంత్రి పార్థసారథి తనయుడు నితిన్ కృష్ణ, విజయ మిల్క్ సొసైటీ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు, ముసునూరు మాజీ జెడ్‌పిటిసి చిలుకూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

యూరియా అందుబాటులో ఉంచాలి : ఎంఎల్ఎ

దెందులూరు: సొసైటీల ద్వారా రైతులకు పూర్తి స్థాయిలో యూరియా అందుబాటులో ఉంచాలని వ్యవసాయ శాఖ అధికారులకు దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ సూచించారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయం పెదపాడు మండలంలోని కొక్కిరపాడు, వేంపాడు, దాసరిగూడెం గ్రామాల్లో ఆయన పర్యటించి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించారు. దెందులూరు మార్కెట్ యార్డ్ కమిటీ ఛైర్మన్ గారపాటి రామసీత, పెదపాడు మండల అధ్యక్షులు మద్దాని రవి, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సేవలపై అవగాహన

టి.నరసాపురం: ప్రజలందరూ ప్రభుత్వం అందించే సేవలపై అవగాహన కలిగి ఉండాలని బొర్రంపాలెం పంచాయతీ కార్యదర్శి పగడాల నాగేశ్వర రావు తెలిపారు. మండలంలోని బొర్రంపాలెం గ్రామంలో మన మిత్ర వాట్సప్ గవర్నెన్స్‌పై స్థానిక సచివాలయ సిబ్బందితో మంగళవారం అవగాహన కల్పించారు.

కుక్కునూరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వినూత్న వాట్సప్ గవర్నెన్స్ విధానంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు 15 గ్రామ పంచాయతీల్లో ర్యాలీలు నిర్వహించినట్లు ఎంపిడిఒ నరసింహారావు తెలిపారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు మొలిశెట్టి యుగంధర్, బిసిఎస్ జర్ మయూరి ఉన్నారు.


చింతలపూడిలో..


ఆగిరిపల్లిలో..


టి.నరసాపురంలో..


భీమడోలులో..


జీలుగుమిల్లిలో..


కలిదిండిలో..


నిడమర్రులో..


ద్వారకాతిరుమలలో..

స్మార్ట్ మీటర్లు బిగించొద్దు..

ట్రూ అప్ ఛార్జీలు రద్దు చేయాలి
ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యాన పలుచోట్ల ధర్నాలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

స్మార్ట్ మీటర్లు వద్దని, ట్రూ అప్ ఛార్జీల పేరుపై ప్రజల వద్ద వసూలు చేసిన కరెంటు ఛార్జీలను తిరిగి ప్రజల అకౌంట్లో జమ చేయాలని డిమాండ్ చేస్తూ ప్రజాసంఘాల ఐక్య కార్యాచరణ వేదిక ఆధ్వర్యాన మంగళవారం స్థానిక విద్యుత్ భవనం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమాన్ని ఉద్దేశించి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి, ఐఎఫ్‌టియు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, వ్యవసాయ కార్మిక సంఘం(సిపిఐ) జిల్లా నాయకులు మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం తొమ్మిది సార్లు కరెంట్ ఛార్జీలు పెంచి 32 వేల కోట్ల భారం ప్రజలపై వేసిందని, స్మార్ట్ మీటర్లు ఆనాడు అదానీతో వైసిపి ప్రభుత్వం ఒప్పందం చేసుకుందన్నారు. స్మార్ట్ మీటర్లను బిగిస్తే పగలగొట్టమని లోకేష్ ఆనాడు కూటమి నాయకులకు పిలుపునిచ్చారని, కానీ నేడు స్మార్ట్ మీటర్లు బిగిస్తూ కూటమి ప్రభుత్వం ప్రజలపై భారాలు వేస్తుందని విమర్శించారు. పాత మీటర్లు వద్దని, స్మార్ట్ మీటర్లు కావాలని ప్రజలు ఏమన్నా ప్రభుత్వాన్ని అడిగారా అని వారు ప్రశ్నించారు. ఇప్పటికైనా పెంచిన కరెంటు ఛార్జీలను తగ్గించాలని, గతంలో(ఎఫ్‌పిపిసిఎ) పేరు మీద ప్రజల వద్ద అదనంగా వసూలు చేసిన కరెంటు ఛార్జీలను తిరిగి ప్రజల అకౌంట్లో జమ చేయాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం విద్యుత్ శాఖ అధికారులకు ప్రజా సంతకాల సేకరణ పత్రాలను అందజేశారు. విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని అధికారులు హామీ ఇచ్చారు. వివిధ సంఘాల నాయకులు ఉప్పులూరు హేమ శంకర్, పంపన రవికుమార్, యర్రా శ్రీనివాస్ రావు, డిఎన్‌విడి.ప్రసాద్, బి.సోమయ్య, కె.శ్రీనివాస్, రెడ్డి శ్రీనివాస్ డాంగే, కె.లెనిన్, జి.విజయ లక్ష్మి పాల్గొన్నారు.

చింతలపూడి : స్మార్ట్ మీటర్లు వద్దు - విద్యుత్ శాఖ మీటర్ల ముద్దు అంటూ చింతలపూడి మండల కేంద్రంలో వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు అదానీ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా చింతలపూడి బోసు బొమ్మ సెంటర్ నుండి ప్రదర్శనగా బయలుదేరి విద్యుత్ ఎడి కార్యాలయం ముందు బైఠాయించారు. వామపక్షపార్టీ నాయకులు పి.పాండురంగారావు, కె.గురవయ్య, రంగనాథులు స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా మాట్లాడారు. అనంతరం విద్యుత్ శాఖ అధికారికి వెయ్యి సంతకాలతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పి.సోమశేఖర్, కె.చంద్రశేఖర్ రెడ్డి, దంతా కృష్ణ, కాలేషా స్మార్ట్ మీటర్ల వల్ల రైతాంగానికి జరిగే నష్టాలను వివరించారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు లాజర్, సులేమాన్, మహిళా సంఘం నాయకులు ఎం.వరలక్ష్మి, అనురాధ పాల్గొన్నారు.

పోలవరం : స్మార్ట్ మీటర్లను వెనక్కి తీసుకోవాలని, ట్రూ ఆఫ్ ఛార్జీలను రద్దు చేయాలని, ప్రజలపై విద్యుత్ భారాలను మోపవద్దని పోలవరం సబ్ స్టేషన్ ముందు ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ఆదివాసి గిరిజన సంఘం జిల్లా నాయకులు కారం భాస్కర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను, హామీలను తుంగలో తొక్కి వేస్తుందన్నారు. స్మార్ట్ మీటర్లు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చ రించారు. ధర్నా అనంతరం అధికారికి సంతకాలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా నాయకులు చవులం రాంబాబు, ఆదివాసి గిరిజన సంఘం నాయకులు బొరగం భూచంద్రావు, ప్రగతిశీల యువజన సంఘం జిల్లా నాయకులు నడపల ముక్కారెడ్డి పాల్గొన్నారు.

కుక్కునూరు రూరల్ : స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని, పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని కోరుతూ అఖిలపక్షం ఆధ్వర్యాన స్థానిక రామసింగారం సెంటర్ నుండి సబ్ స్టేషన్ వరకు ప్రదర్శన నిర్వహించారు. సబ్ స్టేషన్‌ను ముట్టడించి సబ్ స్టేషన్ ముందు ధర్నా నిర్వహించారు. అదానీ స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని, పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని నినాదాలు చేశారు. అనంతరం వినతి పత్రాన్ని విద్యుత్ శాఖ అధికారికి అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు మోడియం నాగమణి, సిపిఎం నాయకులు వై.సాయికిరణ్, పట్ల లక్ష్మయ్య, సిపిఐ మండల కార్యదర్శి లక్ష్మయ్య, నాయకులు బాబురావు, సిపిఐ(ఎంఎల్) మాస్ జిల్లా నాయకులు ఎస్‌కె.గౌస్, కన్నయ్య, సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు జడ్డి రాజులు, రఘు పాల్గొన్నారు.

భీమడోలు : అదానీకి లాభాలు.. ప్రజలపై భారాలు మోపే స్మార్ట్ మీటర్లను తిరస్కరించాలని కోరుతూ ప్రజాసంఘాల ఐక్యవేదిక భీమడోలు ఆధ్వర్యాన పోలసానిపల్లిలోని ఎడిఇ కార్యాలయం ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం మోడీ ప్రభుత్వ ఆదేశాలతో అదానీ లాభాల కోసం రాష్ట్ర ప్రజలపై భారాలు మోపుతూ బలి పశువులను చేస్తోందని విమర్శించారు. పాత మీటర్లను కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికే వాణిజ్య వ్యాపార సంస్థలకు బిగించారని, వాటి బిల్లులు నాలుగు రెట్లు వస్తున్నాయని లబోదిబోమంటున్నారని, ఆ భారాలన్నీ పరోక్షంగా మళ్లీ ప్రజలపై పడతాయని ఆవేదన వ్యక్తంచేశారు. తక్షణమే స్మార్ట్ మీటర్ల బిగింపును ఆపాలని, లేకుంటే ఈనెల 28వ తేదీన విద్యుత్ అమరవీరుల స్ఫూర్తితో మహోద్యమానికి సిద్ధమ వుతామని తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, యువజన సంఘం నాయకులు పోలుకొండ నాగరాజు, తానిగడప రత్తయ్య పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : స్మార్ట్ మీటర్ల పేరుతో జరగబోయే ప్రజా దోపిడీని అరికట్టాలని ప్రజాసంఘాల ఆధ్వర్యాన స్థానిక తహశీల్దార్ కార్యాలయం నుంచి విద్యుత్ సబ్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం సబ్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం విద్యుత్ శాఖ సిబ్బందికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పలు ప్రజాసంఘాల నాయకులు ఈబిచర్ల భూషణం, కారం దారయ్య, తెల్లం దుర్గారావు, కట్టం ముత్యాలరావు మాట్లాడారు. ప్రజాసంఘాల నాయకులు కట్టం నాగేశ్వరరావు, ఎడ్లపల్లి నాగేశ్వరరావు, కరక నాగన్న, డోల నరసారావు, కొప్పుల నాగరాజు, కారం బుజ్జి, వీరంకి దుర్గారావు, చిట్టి బొమ్మ కొండలరావు పాల్గొన్నారు.

టి.నరసాపురం : రాష్ట్రంలో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ వామపక్ష ప్రజాసంఘాల ఆధ్వర్యాన చేపట్టిన ధర్నా కార్యక్రమంలో భాగంగా స్మార్ట్ మీటర్ మాకొద్దు - పాత మీటర్లే ముద్దు అంటూ ప్రజలంతా స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని నినాదాలు చేశారు. పాత పెట్రోల్ బంకు వద్ద నుండి విద్యుత్ సబ్ స్టేషన్ వరుకు ర్యాలీ ప్రదర్శన నిర్వహించారు. సబ్ స్టేషన్‌లో విద్యుత్ ఎఇకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంబేద్కర్ సెంటర్లో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు, సిపిఐ జిల్లా కమిటీ సభ్యులు బిఎస్.సాగర్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గుడెల్లి వెంకట్రావు, సిపిఐ ఎంఎల్ జనశక్తి జిల్లా కాయకులు కారం భాస్కర్ మాట్లాడారు.

నూజివీడు టౌన్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై మోపుతున్న విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా వామపక్షాల రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా పట్టణంలోని విద్యుత్ కార్యాలయం వద్ద సిపిఐ, సిపిఎం ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం తొమ్మిది సార్లు కరెంటు ఛార్జీలు పెంచి 32 వేల కోట్ల భారం ప్రజలపై వేసిందన్నారు. స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని రద్దు చేసుకొని, విద్యుత్ ఛార్జీలు, ట్రూ అప్ ఛార్జీలు వెంటనే తగ్గించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు కొమ్మన నాగేశ్వరరావు, సిపిఐ టౌన్ సెక్రటరీ చాట్ల పుల్లారావు, మండల నాయకులు మడుపల్లి నాగేంద్రరావు, రైతుసంఘం నాయకులు కూచిపూడి నాగేశ్వరరావు, సిపిఎం టౌన్ సెక్రటరీ ఎన్ఆర్.హనుమానులు, సిపిఎం మండల కార్యదర్శి పి.సుభాష్ చంద్రబోస్ పాల్గొన్నారు.

నిడమర్రు : మండలంలోని భువనపల్లి గ్రామంలో విద్యుత్ సబ్ స్టేషన్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సిఐటియు జిల్లా నాయకులు నారపల్లి రమణారావు మాట్లాడుతూ మోడీ ఆదేశాలతో టిడిపి కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన అదానీ ప్రీపైడ్ స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం అధికారులకు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గవర సత్యనారాయణ, రైతు సంఘం నాయకులు కోన శ్రీనివాసరావు, వి.మోహన్, సిఐటియు కానూరు రాజు, కంచం వరప్రసాద్ ఉన్నారు.

వేలేరుపాడు రూరల్ : విద్యుత్ సర్దుబాటు ఛార్జీలు తగ్గించాలని కోరుతూ మండలంలో అఖిలపక్షం ఆధ్వర్యాన మంగళవారం ధర్నా నిర్వహించారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయాల నుంచి తహశీల్దార్ కార్యాలయం మీదుగా స్థానిక సబ్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించి వినతి పత్రం అందించారు.. సిపిఎం మండల కార్యదర్శి ధర్ముల రమేష్, జిల్లా నాయకులు మడివి దుర్గారావు, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎండీ మునీర్, మండల కార్యదర్శి బాడిశ రాము, సాయి పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల : స్మార్ట్ మీటర్ల బిగింపును వ్యతిరేకిస్తూ సిపిఐ మండల కార్యదర్శి గోలిమే బాల యేసు ఆధ్వర్యాన సబ్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో తిమ్మాపురం గ్రామ కార్యదర్శి యడ్లపల్లి రమేష్, పెండ్లి భూషణం, జాలాది సత్యవతి, దుద్దే రాణి, సుబ్బారావు, నల్లటి గంగరాజు పాల్గొన్నారు.

ముసునూరు : మండలంలోని ముసునూరు, రమణక్కపేట, వలసపల్లి, సబ్ స్టేషన్ వద్ద వామపక్షాల ఆధ్వర్యాన ధర్నా చేపట్టారు. అనంతరం ర్యాలీగా వెళ్లి ముసునూరు, వలసపల్లి, రమణక్కపేట రహదారిపై రాస్తారోకో చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు మాట్లాడారు. కార్యక్రమంలో కోడవలి శ్రీనివాస్, కంచర్ల రమేష్, కంచర్ల శివప్రసాద్, అనిల్, రాజు, కంచర్ల దుర్గారావు, పిల్లి మురళీ పాల్గొన్నారు.


ముసునూరులో


వేలేరుపాడులో..


పోలవరంలో..

బుట్టాయగూడెం : ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యాన ఏజెన్సీ మండల కేంద్రంలో ర్యాలీ, విద్యుత్ సబ్ స్టేషన్ ముందు కారం రాఘవ అధ్యక్షతన ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ ధర్నా కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు ధర్ముల సురేష్, గిరిజన సంఘం నాయకులు తెల్లం రామకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం బేతి కిషోర్, పివైఎల్ తగరం బాబురావు, కట్టం వీరాస్వామి, వి.భారతి, సముద్రాల సుందర్ రావు, ఎఐకెఎంఎస్ పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : స్మార్ట్ మీటర్ల ఏర్పాట్లను వెంటనే ఉపసంహరించుకోవాలని, ట్రూ అప్ ఛార్జీలను రద్దు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి చాకిరి శివనాగరాజు డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన ఆగిరిపల్లిలో నిరసన కార్యక్రమం చేపట్టి, అనంతరం విద్యుత్ సబ్‌స్టేషన్ ఇన్‌ఛార్జి ఎఇకి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం టౌన్ కార్యదర్శి షేక్ జహంగీర్ భాషా, మండల కమిటీ సభ్యులు ముత్యాల నరేష్ పాల్గొన్నారు.

కలిదిండి : ప్రజాసంఘాల ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నిరసన చేపట్టారు. అనంతరం ర్యాలీగా తహశీల్దార్ కార్యాలయం వరకు తరలివెళ్లి గ్రామాల్లో చేపట్టిన సంతకాల సేకరణలో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ రామకృష్ణకు అందజేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మహంకాళిరావు మాట్లాడారు. సిఐటియు మండల కార్యదర్శి జక్కుల మహేష్, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహనుండాలి : సిఐ

ఏలూరు స్పోర్ట్స్ : విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండి ప్రమాద స్థాయిలో ఉన్న వారికి బాసటగా నిలవాలని ఏలూరు ఒకటో పట్టణ సిఐ సత్యనారాయణ తెలిపారు. ఏలూరు నగరంలోని శ్రీకృష్ణదేవరాయ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు గుడ్ టచ్-బ్యాడ్ టచ్, సైబర్ నేరాలు, చట్టాలపై అవగాహన వంటి విషయాలపై ఒకటో పట్టణ పోలీసుల ఆధ్వర్యాన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఏలూరు ఒకటో పట్టణ ఎస్ఐ మదీనా భాషా మాట్లాడుతూ బాలికలపై కొందరు లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారని, మహిళా భద్రత కోసం ప్రత్యేకంగా శక్తి యాప్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిందని తెలిపారు. ఆపద సమయంలో ఈ యాప్‌ను ఉపయోగించడం ద్వారా పోలీసుల సహాయం పొందవచ్చునని సూచించారు. అత్యవసర సమయాలలో 112కు ఫోన్ చేయడం ద్వారా కూడా పోలీసుల సహాయాన్ని పొందవచ్చునని ఆయన వారికి సూచించారు. సోషల్ మీడియాలలో అపరిచిత వ్యక్తులతో పరిచయాలు కలిగి ఉండడం ద్వారా ఎదురయ్యే సమస్యలను వివరించారు. సైబర్ నేరగాళ్లు కూడా సోషల్ మీడియాలో పరిచయాలు పెంచుకొని వారి ఖాతాల నుండి సొమ్ములు తస్కరిస్తున్నారని, జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో ఏలూరు ఒకటో పట్టణ సిఐ సత్యనారాయణ, ఎస్ఐ మదీనా భాషా పాల్గొన్నారు.

రైతాంగ సమస్యలు పరిష్కరించాలి

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటీ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లాలోని రైతాంగ సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. మంగళవారం ఏలూరు అన్నే భవనంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం ఆ సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు అధ్యక్షతన నిర్వహించారు. జిల్లాలోని రైతాంగ సమస్యలు చర్చించి పలు తీర్మానాలు ఆమోదించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో రైతాంగం అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, యూరియా కొరత వల్ల రైతులు షాపులు చుట్టూ తిరగాల్సి వస్తోందన్నారు. యూరియా కొరత నివారించి రైతులకు యూరియా అందించాలని తెలిపారు. పెంచిన ఎరువుల ధరలు తగ్గించాలన్నారు. ఉచిత పంటల పథకాన్ని అమలు చేయాలని, అన్ని పంటలకు పంటల బీమా పథకం వర్తింపజేయాలన్నారు. కృష్ణా, గోదావరి డెల్టాల శివారు ప్రాంత భూములకు సాగునీరు అందించి పంటలు సాగు చేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శులు కోన శ్రీనివాసరావు, బొడ్డు రాంబాబు జిల్లా కమిటీ సభ్యులు సున్నా వెంకటరావు, లావేటి సోంబాబు పాల్గొన్నారు.